జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 15-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 426 పేజీలు: 4 వెల : రూ.7

# పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం





* ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు * కవాతు, రిహార్సల్స్ పరిశీలించిన ఎస్పీ * జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్న మంత్రి అచ్చెన్నాయుడు * ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాల అందజేత * విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన

**శ్రీకాకుళం, ఆగస్టు 14 (వార్త):** 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించనున్నారు. సభాప్రాంగణం, పోలీసుల పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన, జిల్లా ప్రజలు తిలకించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వాతంత్ర్య పోరాట యోధుల కుటుంబాలను సన్మానించనున్నారు. ఉత్తమ సేవలు అందించిన 169 మంది ఉద్యోగులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. అలాగే స్త్రీ శక్తి పథకం పేరిట మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని మంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో పోలీసు పరేడ్‌ను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం పరిశీలించారు. ఏఆర్ డీఎస్పీ శేషాద్రి పరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీస్ కవాతు సాధన నిర్వహించారు. ఈ పరేడ్ రిహార్సల్స్ లో భాగంగా ముందుగా సిబ్బంది నుండి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మైదానంలో వీఐపీల వాహనాల, ఇతర వాహనాలు పార్కింగ్, ట్రాఫిక్, భద్రత బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద శేషాద్రి, సీఐ ఈశ్వరరావు, ఆర్ఐ కె.నర్సింగరావు, శంకర్ ప్రసాద్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## అన్నదాత శ్రేయస్సే..
# ప్రభుత్వ లక్ష్యం

* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
* సంతబొమ్మాళి నుంచి కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ వరకూ ట్రాక్టర్ ర్యాలీ



**సంతబొమ్మాళి, ఆగస్టు 14 (వార్త):** రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మి రైతు శ్రేయస్సే ధ్యేయంగా ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నందున గాను సంఘీభావంగా సంతబొమ్మాళి మండలం పాలేసమ్మ గుడి నుంచి కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్ వరకు రైతులు ట్రాక్టర్లతో గురువారం నిర్వహించిన రైతు చైతన్య ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. ట్రాక్టర్‌ను స్వయంగా నడిపి రైతుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. రైతులు స్వచ్ఛందంగా ట్రాక్టర్లతో ర్యాలీలో పాల్గొని అభిమానాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీలో భాగంగా ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అయినప్పటికీ 90 శాతం వరకు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పథకాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నదాత సుఖీభవ కింద రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందని, పోర్టుకు అనుసంధానంగా పరిశ్రమలు వస్తాయన్నారు. మూలపేట నుంచి వేములవాడ మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు తీర ప్రాంత 8 లైన్ల రహదారి నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రెండు నెలల్లో మూలపేట పోర్టుకు తొలి షిప్ వచ్చేలా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# ప్రియుడితో కలిసి భర్త హత్య

* అక్రమ సంబంధమే హత్యకు కారణం * ముగ్గురిని అరెస్టు చేసిన పాతపట్నం పోలీసులు
* వివరాలు వెల్లడించిన టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు



**పాతపట్నం/శ్రీకాకుళం క్రైం,ఆగస్టు 14 (వార్త):** ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన ఘటన పాతపట్నం మండలంలో చోటుచేసుకుంది. టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు ఈ ఘటనకు సంబంధించి గురువారం పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో మీడియా వివరాలు అందజేశారు. పాతపట్నం మొండి గొల్లవీధికి చెందిన నల్లి రాజుకు మౌనికతో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. మౌనికకు పాతపట్నం మాదిగ వీధికి చెందిన గుండు ఉదయ్ కుమార్‌తో అక్రమ సంబంధం కలిగివుంది. ఉదయ్‌కు సైతం వివాహమైంది. మౌనిక అక్రమ సంబంధం విషయం తెలియడంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. రాజును అంతం చేయడంతో పాటు చేసి భార్యకు విడాకులు ఇచ్చి, ఆ తర్వాత వివాహం చేసుకోవాలని మౌనికతో పాటు ఉదయ్ నిర్ణయించుకున్నారు. రాజు హత్యకు ఇద్దరూ కలిసి పథకం పన్నారు. దీనిలో భాగంగా రాజుతో, ఉదయ్ ఒక కొత్త ఫోన్ నెంబర్‌తో అమ్మాయిలాగా వాట్సప్‌లో గత రెండు నెలలుగా చాటింగ్ చేసేవాడు. ఏకాంత ప్రదేశానికి రప్పించి దాడి చేసి చంపాలని అనుకున్నా రాజు మాత్రం వెళ్లలేదు. దీంతో ప్రియుడు ఉదయ్‌తో కలిసి మౌనిక మరో ప్లాన్ వేశారు. రాజును ఇంటిలోనే నిద్ర మాత్రలు ఇచ్చి ఆ తర్వాత చంపాలని కుట్ర పన్నారు. అందుకోసం ఉదయ్ తన బావ మల్లికార్జున సహాయం కోరాడు. వారి కుట్రలో భాగంగా ఉదయ్ పర్లాకిమిడిలో ఒక ఆర్ఎంపీ వద్ద నిద్ర మాత్రలు కొని, మౌనికకు ఇచ్చాడు. మౌనిక తన భర్త రాజుకు హత్య కాబడిన ముందు రోజు తక్కువ మోతాదులో అన్నంలో కలిపి తినిపించింది. రాజు మత్తులోకి వెళ్ళటం గమనించింది. ఆ మరుసటి రోజు ఆగస్టు 6న రాత్రి మోనిక ఆరు మాత్రలను రాజుకు భోజనంలో కలిపి పెట్టింది. అది తిన్న రాజు గాఢ మత్తులోకి వెళ్లిపోయాడు. దీంతో మౌనిక తన ప్రియుడు ఉదయ్‌కు ఇంటికి రమ్మని ఫోన్ చేసింది. పథకంలో భాగంగా ఉదయ్, మల్లికార్జున మొదట వీధి లైట్లు ఆపేసి రాత్రి 11.30 గంటల సమయంలో మౌనిక ఇంటికి వెళ్లారు. గాఢ నిద్రలో ఉన్న రాజు ముఖంపై తలగడ పెట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేశారు. రాజు తాగి చనిపోయి నట్టు అందరినీ నమ్మించడానికి రాజుకు చెందిన చెప్పుల జతను, మద్యం బాటిల్‌ను, బండిని వీధి చివరి పెట్టారు. అలాగే రాజు మృత దేహాన్ని అక్కడే పడవేశారు. ఆ తర్వాత వారు వెళ్లిపోయారు. ఎవరికీ అనుమానం రాకుండా మౌనిక తన భర్త, అత్తమామల ఫోన్‌కు పదేపదే ఫోన్ చేసింది. తన అత్తమామకు, కుటుంబీకులకు రాత్రి భర్త ఇంటికి రాలేదని ఫోన్‌లో చెప్పింది. ఆ మరుసటి రోజు భర్త మృతి చెందిన విషయం తెలుసుకుని ఎవరికీ అనుమానం రాకుండా కన్నీరు మున్నీరైంది. భర్త మృతిపై పాతపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోస్ట్ మార్టం నివేదిక ఆధారంగా రాజుది హత్యగా పోలీసులు గుర్తించారు. భార్య మౌనిక తీరుపై అనుమానం కలిగి తమదైన శైలిలో విచారణ చేయగా ఆమె ఏం జరిగిందనేది కక్కేసింది. హత్య చేసిన ముగ్గురిని అరెస్టు చేశామని డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ వి.రామారావు, ఎస్ఐ బి.లావణ్య, సిబ్బంది జీవరత్నం, గౌరీశంకర్, పరమేష్‌లను ఎస్పీ అభినందించారు.

## చిన్నబజార్ - ఇల్లిసిపురం రోడ్డు పనుల్లో..
# భారీ అవకతవకలు

* కోట్లలో అధికారులకు ముడుపులు * ముగ్గురు మాజీ వుడా ఇంజినీర్లపై విచారణకు ప్రభుత్వం ఆదేశం * వెలుగులోకి తెచ్చిన విజిలెన్స్ అధికారులు
* రెండు నెలల్లో విచారణ పూర్తిచేయాలని ఆదేశం

**శ్రీకాకుళం, ఆగస్టు14 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని చిన్నబజార్ -ఇల్లిసిపురం రోడ్డుకు విస్తరణ, వి.డి.ఎఫ్ సిమెంట్ కాంక్రీట్ వేసే పనులు, వర్షపు నీటి డ్రైన్ల నిర్మాణం పేరుతో వుడా (ప్రస్తుత వీఎంఆర్డీఏ) అమలు చేసిన ప్రాజెక్ట్‌లో కోట్ల రూపాయల అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. ఏపి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నిర్వహించిన దర్యాప్తులో మాజీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శ్యామ్ సుందర్, మాజీ అసిస్టెంట్ ఇంజనీర్ (క్వాలిటీ కంట్రోల్ సెల్) ఏ.వి. రమణారావు, మాజీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ డి. విజయ భారతిలపై తీవ్ర ఆరోపణలు నిర్ధారణ కావడంతో ప్రభుత్వం ఏపి సివిల్ సర్వీసెస్ రూల్స్ 1991లోని రూల్ 20 ప్రకారం చర్యలకు ఉపక్రమించింది. 2015లోనే వెలుగులోకి వచ్చిన ఈ అవకతవకల కేసులో పనుల నాణ్యతలో లోపాలు, అంచనాల కంటే అధిక బిల్లులు చెల్లింపు, అనుమతి లేని సాంకేతిక మార్పులు, ఆర్థిక క్రమశిక్షణా ఉల్లంఘనలు వంటి అంశాలు గుర్తించబడ్డాయి. ఈ కేసులో సంబంధిత అధికారులు ఇచ్చిన రాతపూర్వక సమాధానాలు అసంతృప్తికరంగా ఉన్నందున, రెగ్యులర్ విచారణకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆరోపణలపై పూర్తి సాక్ష్యాలు, రికార్డులు పరిశీలించి రెండు నెలల్లో తుది నివేదిక సమర్పించాలంటూ ప్రభుత్వం స్పష్టమైన గడువు విధించింది. విచారణలో నిర్ధారణ అయితే, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశముందని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అనుమానాస్పద ఖర్చులు, నాణ్యత లోపాలు అప్పట్లోనే ప్రజలు ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా విచారణ ప్రారంభించడం, ముఖ్యంగా మాజీ వుడా ఇంజనీర్లు, అకౌంట్స్ ఆఫీసర్ స్థాయి అధికారులపై నేరుగా చర్యలు మొదలుపెట్టడం, శ్రీకాకుళం పట్టణంలో చర్చనీయాంశమైంది.



## గౌతు లచ్చన్న జయంతి అధికారికంగా నిర్వహణ

**పలాస, ఆగస్టు14(వార్త):** గౌతు లచ్చన్న జయంతి అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. 116 వ జయంతి వేళ జీవో జారీ చేసిన ప్రభుత్వం. ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించడానికి జీవో ఇచ్చిన ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు గురువారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కృతజ్ఞతలు తెలిపారు. నెంబర్ 83 ను ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, యువ నాయకులు నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలిపిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలియజేశారు.



# బాతువ పీఏసీఎస్ అధ్యక్షుడిని మార్చండి

**-ఆ పదవి బాతువ వాసికే ఇవ్వాలి**

**- రైతులకు న్యాయం చేయాలి**

**-పీఏసీఎస్ ముందు నిరసన, నినాదాలు**



**జి.సిగడాం, ఆగస్టు 14(వార్త):** బాతువ పీఏసీఎస్ పాలక మండలి అధ్యక్షుని నియామకంపై సంబందిత అధికారులు పునఃపరిశీలన చేయాలని బాతువ గ్రామానికి చెందిన పలువురు నాయకలు, యువకులు గురువారం బాతువ పీఏసీఎస్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసారు. పీఏసీఎస్ ఆరంబం నుంచి పీఏసీఎస్ అధ్యక్ష పదవి తమ గ్రామానికి చెందిన వ్యక్తినే ఎన్నుకోవటం లేదా నియమించటం జరుగుతూ వస్తుందని, ఇప్పుడు ప్రక్క గ్రామమైన గెడ్డకంచరాంకు చెందిన వ్యక్తికి పీఏసీఎస్ అధ్యక్ష పదవి కట్టపెట్టటం ఎంతవరకు సమంజసమని ఆందోళన వ్యక్తం చేసారు. తమకు ఊహ తెలిసినప్పటి నుంచి తమ గ్రామానికి చెందిన వ్యక్తులే అధ్యక్ష పదవులు చేపడుతున్నారని, ఇప్పుడు రైతుల మనోభావాలు దెబ్బతీసేలా వేరే గ్రామస్తునికి అధ్యక్ష పదవి ఇవ్వటం దారణమన్నా రెండు టీసీలు ఉన్న గెడ్డకంచరాం గ్రామానికి అధ్యక్ష పదవి కేటాయించటం గ్రామస్తులను అవేదనకు గురిచేస్తుందన్నారు. తమ ప్రజల ఆంక్షలను ఉన్నతాదికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పీఏసీఎస్ చైర్మన్ పదవి తమ గ్రామానికి చెందిన వారికి కేటాయించాలని కోరారు. చైర్మెన్ పేరును మార్చటం ద్వారా ప్రజల మనోభావాలను గౌరవించినట్టు అవుతుందని, అందుకు తమ వంతు గ్రామస్తుల సహకారాన్ని అందిస్తామన్నారు. పీఏసీఎస్ అధ్యక్ష పదవి బాతువకే ఉండాలి, బాతువ రైతులకు న్యాయం చేయాలి అంటూ పీఏసీఎస్ కార్యాలయం ముందు నినాదాలు చేసారు.

# వాహనమిత్ర పథకం తక్షణమే అమలు చేయాలి



**కొత్తూరు, ఆగస్టు 14(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆటో, మాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు వాహనమిత్ర పథకం తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఆటో, మాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు వాహనమిత్ర పథకం కింద రూ.15,000 ఇస్తామని హామీ ఇచ్చి, నేటికీ అమలు చేయకపోవడం అన్యాయమని అన్నారు. ఆటో డ్రైవర్లందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద భీమా వర్తింప చేయాలని, ఆటో డ్రైవర్లకు నష్టదాయకమైన జి.ఓ. 21 రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఆందోళనలో ఆటో డ్రైవర్లు కొత్తూరు లోని నాలుగు రోడ్ల కూడలి అంబేద్కర్ విగ్రహం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల తహసీల్దార్ బాలకృష్ణకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బి. సురేష్, సిహెచ్. రామారావు, తవుడు, పల్ల.క్రిష్ణ, వాసు, ప్రసాద్, జమ్మయ్య, మాధవ్, ఇల్లయ్య, పకీర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉత్సాహంగా క్రీడా పోటీలు

**జలుమూరు, ఆగస్టు 14 (వార్త):** జలుమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలలో ఉత్సాహంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈఓ బమ్మిడి మాధవరావు మాట్లాడుతూ.. శుక్రవారం జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాలల్లో క్రీడా పోటీలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఈ క్రమంలో ఆయా పాఠశాలల్లో హెచ్ఎంలు విద్యార్థులతో పలు క్రీడా పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో బహుమతులు అందజేస్తామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



**జలుమూరు, ఆగస్టు 14 (వార్త):** నరసన్నపేట మండలం జమ్మూ పంచాయతీ లోని మందాలమ్మ గుడి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. జలుమూరు మండలం లింగాలవలసకు చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై నరసన్నపేట నుంచి లింగాలవలస వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన ఆటో ఆయనను ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడి కాలు విరిగింది. 108 సిబ్బంది అతడిని చికిత్స కోసం శ్రీకాకుళంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు

## దరివాడ పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ



**జలుమూరు, ఆగస్టు 14 (వార్త):** జలుమూరు మండలం దరివాడ ప్రభుత్వ పాఠశాలను ఎంఈఓ-1 బమ్మిడి మాధవరావు గురువారం పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థులతో మాట్లాడి, విద్యా బోధన ఎలా జరుగుతుందో తెలుసుకున్నారు. బోధనా సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాలని ఉపాధ్యాయుడు జనార్ధనరావుకు సూచించారు. అలాగే, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు స్థానిక పెద్దలతో కలిసి కృషి చేయాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలని ఆయన ఆదేశించారు.

## ఇండిపెండెన్స్ డే బెలూన్







**ఇచ్ఛాపురం, ఆగస్టు 14(వార్త):** జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు, శ్రీకాకుళం జిల్లా ఆవిర్భావం అయ్యి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా వజ్రోత్సవం వేడుకలో భాగంగా పురపాలక సంఘ ఆవరణలో కమీషనర్ రమేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గం శాసన సభ్యులు . బెంధాళం అశోక్ మరియు మునిసిపల్ చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మి చేతులు మీదగా గ్యాస్ బెలూన్ ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, టీడీపీ పార్టీ ప్రతినిధులు కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

## చెత్త సంపద కేంద్రాలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**జి.సిగడాం, ఆగస్టు 14(వార్త):** చెత్త సంపద కేంద్రాలపై నిర్లక్ష్యం వహించే కార్యదర్శులపై చర్యలు తప్పవని జిల్లా కోఆర్డినేటర్ పంచాయతీ వనరుల కేంద్రం అదికారి కె.నిశ్చల అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి. రామకృష్ణ ఆద్యర్వంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అన్ని పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్య పనులు, దోమల నివారణకు చేపడుతున్న చర్యలు పలు పారిశుధ్య అబివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రతి రోజు గ్రామాల్లో చెత్త సేకరణ జరగాలని కాలువల్లో



ఎప్పటికప్పుడు పూడికలు తీయించాలని నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అయిల్ బాల్స్ వదలాలని చెప్పారు. ఐవీఆర్ఎస్ సర్వేలో భాగంగా తడి చెత్త పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించమన్నారు. పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నారాయణలో నేత్ర వైద్య శిబిరం

**శ్రీకాకుళం, ఆగస్టు 14 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్లో గురువారం కేర్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నారాయణ సెంట్రల్ ఆఫీసు ఆధ్వర్యంలో జరిగిన నేత్ర వైద్య శిబిరంలో హెచ్ఆర్ సాలుగు రాజేష్, ఆర్ఐ రాంబాబు, ప్రిన్సిపాళ్లు భాస్కరరావు, సుబ్బారావు, కేర్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, నారాయణ విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో శ్రీవరి సాగు

**నరసన్నపేట, ఆగస్టు 14(వార్త):** నరసన్నపేట మండలం రావులవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతులు పల్లి, శివ, పల్లి. శంకర్రావు ఇద్దరు రైతులతో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి. సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీవరి సాగు 7:00 ఎకరాలలో బుధవారం వరి నాట్లు వేసే యంత్రంతో వేయించడం జరిగింది. ఈ శ్రీవరి సాగు చేయడం వలన విత్తనం ఖర్చు తగ్గుతుంది, కూలులు ఖర్చు తగ్గుతుంది, 15 రోజుల లేత నారు మొక్క మొక్కకి దూరం 25 సెంటీ, మీటర్లు పాటించడం వలన గాలి వెలుతూ బాగా తగిలి పిలకలు బాగా పెట్టి సాధారణ పద్ధతి కంటే 15 బస్తాలు దిగుబడి వస్తుంది. తద్వార ఎక్కువ ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అదనపు డిపిఎం ధనంజయ్, మాస్టర్ ట్రైనర్ తోట. రమణ, ప్రకృతి సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## సమ సమాజంతోనే అసలైన స్వాతంత్ర్యం

**పలాస, ఆగస్టు 14(వార్త):** దేశంలో సమ సమాజం స్థాపించినప్పుడే అసలైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లని ప్రముఖ సామాజికవేత్త జుత్తు తాతారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందరికీ సమాన అవకాశాలు, మంచి జీవనస్థితి ఉన్నప్పుడే నాటి అమరవీరుల త్యాగానికి సంపూర్ణ సార్ధకత చేకూరుతుందన్నారు. బ్రిటిష్ పాలకుల నుంచి విముక్తి మాత్రమే నాటి అమరవీరులు కోరుకోలేదని ఉత్పత్తిలో సంపదలో సమాన వాటా అందరికీ అందా లన్నది వారి అసలైన ఆకాంక్ష అన్నారు. స్వాతంత్ర ఫలాలు పేదలకు అందించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటిన దేశంలో పేదరికం, నిరుద్యోగం కొనసాగడం విచార కరమన్నారు. సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని ప్రభుత్వాలను ఆయన కోరారు. విద్య, వైద్యం పూర్తిగా ఉచితంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, తొలి ప్రాధాన్యత వీటికి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.



# ఎంపీ కలిశెట్టిని కలిసిన పీఏసీఎస్ చైర్మన్ బెవర

**జి.సిగడాం, ఆగస్టు 14(వార్త):** నూతనంగా ఎన్నికైన జి.సిగడాం పీఏసీఎస్ చైర్మన్ బెవర జగన్నాధరావు, డైరెక్టర్ పడాల అప్పన్న మాష్టారు గురువారం రణస్థలంలో ఎంపీ కార్యాలయంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుని మర్యదపూర్వకంగా కలిసారు. తమ నియామకానికి సహకరించిన ఎంపీకి దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి దన్యవాదాలు తెలిపారు. తమపై నమ్మకంతో పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతలు పెట్టినందుకు రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే చైర్మన్, డైరెక్టర్లకు ఎంపీ దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, మండల సీనియర్ నాయకులు బాలబొమ్మ వెంకటేశ్వ



రరావు, టంకాల మౌళీశ్వరరావు, కామోజుల సీతారాం జక్కంపూడి దాసు, పైల బాబ్జీనాయుడు, మక్క నారాయణరావు(నాయుడు), దుర్గాసి నారాయణరావు తదితరులు ఉన్నారు.



## ఆరు నెలల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 14(వార్త):** రత్తకన్న ఎల్ సి గేటు వద్ద 6 నెలల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు తెలిపారు. పలాస అర్ డి ఓ వెంకటేష్ తో కలిసి స్థల పరిశీలన చేశారు.ప్రయివేటు ఆస్తులు కి నష్టం వాటిల్లకుండా కేవలం రైల్వే ఆస్తుల పరిసరాల్లోనే బ్రిడ్జి నిర్మాణం చేయాలని తెలుగుదేశం నాయకులు కాళ్ల ధర్మారావు, కాళ్ల జయదేవ్, కాళ్ల దిలీప్,గౌరీ దుర్గాజి, జనసేన నాయకులు దాసరి రాజు లు కోరారు. వి కె పేట రోడ్ నుండి టి అర్ డి కార్యాలయం మీదుగా సప్ప శ్రీను పాన్ షాప్ పక్క నుండి రత్తకన్న అర్ అండ్ బి రోడ్డు వరకు బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు.మ్యాప్ ను పరిశీలించారు. భూ సేకరణ ,స్థల సేకరణ కు అడ్డంకులు లేకుండా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరి, ఏ ఈ ఎన్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



# దశాబ్దాల సమస్యకి తెర

**ఇచ్ఛాపురం, ఆగస్టు 14(వార్త):** మున్సిపాలిటీ పరిధి 23వ వార్డు బెల్లుపడ కాలనీలో దశాబ్ద కాలంగా ఉన్న సమస్యను తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యదర్శి శాసన శేఖర్ సొంత ఖర్చులతో పరిష్కరించారు. అమ్మవారి ఆలయం ఆర్చి ఎదురుగా ఉన్న కాలనీ రోడ్డు పక్కన కాలువ మధ్యలో ఓ ఇనుప విద్యుత్ స్తంభం దశాబ్ద కాలంగా నిరుపయోగంగా ఉండిపోయింది. దీనివల్ల కాలువలో చెత్త, మురుగు నీరు నిల్వ ఉండటమే కాకుండా వర్షాలు పడినపుడు మురుగు నీరు కాలనీలోకి వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఈ సమస్యను శేఖర్ దృష్టికి తీసుకురావడంతో విద్యుత్ ఏఈ గోవింద రావు తో మాట్లాడి, ఓ వాహనాన్ని పంపగా, జేసీబీ ఏర్పాటు చేయడంతో పాటు శ్రమదానం చేసి ఆ విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. పదేళ్లుగా మున్సిపల్ అధికారులు, పాలకవర్గం పట్టించుకోని సమస్యను పరిష్కరించినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నేత గోపాలాచారి పాల్గొన్నారు.

## హెచ్ఐవీకి నివారణ ఒక్కటే మార్గం




**పలాస, ఆగస్టు 14(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల మొగలిపాడు జంక్షన్ వద్ద గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ వారి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (దిశా) వారి సహకారంతో, వైసీబీ ట్రకెర్స్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో- ఇంటెన్సిటిఫైడ్ ఈసీఈ ఐ ఈ సి కాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ మాధవరావు ప్రచార మార్గాల ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ చర్యల గురించి ఐఈసి ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ కోసం అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కె.రామకృష్ణ మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ కోసం తెలుసుకొని మిగతా వారందరికీ అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎం.మాధవరావు ప్రాజెక్ట్ మేనేజర్, ఎంఐసిటిసి కౌన్సిలర్ కె రామకృష్ణ, ఎల్టి వైసీబీ ట్రకెర్స్ ప్రాజెక్ట్ ఏఎన్ఎం జయలక్ష్మి, ఎం అండ్ ఇ వి. కామేశ్వరి, హెచ్ఈ పిఈ సిబ్బంది పాల్గొన్నారు.

# కేజీబీవీలో గాంధీజీ, కస్తూరిబా విగ్రహాల ఆవిష్కరణ



**ఇచ్ఛాపురం, ఆగస్టు 14(వార్త):** స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాలలో అలయన్స్ క్లబ్ ప్రతినిధులు గాంధీజీ, కస్తూరిబా ల విగ్రహాలు ఆవిష్కరించారు ఈ విగ్రహాలకు ఆర్ధిక సహాయాన్నిఅందించిన బత్తుల వెంకటరమణ ని ప్రిన్సిపాల్ శిరీష , అలయన్స్ అధ్యక్షులు లోపింటి నరసింహ మూర్తి ఇతర సభ్యులు అభినందించారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నరసింహ మూర్తి,లాభాల వెంకటరావు , ప్రకాష్ రావు రావి జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదర్శవాది తెలుకల రామారావు ని ప్రిన్సిపాల్ శిరీష ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో దక్కత గోపి, చాట్ల లోహిదాసు, బాలకృష్ణ, కాళ్ళ నరసింహ, యోగి, బుజ్జి, గుడియా శ్రీను, వెంకటరమణ, రవి, సత్యమయ్య చంద్రశేఖర్, లోహిదాసు, రఘు, పాల్గొన్నారు.

## బాలికోన్నత పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్



**ఇచ్ఛాపురం, ఆగస్టు 14(వార్త):** మున్సిపల్ బాలికొన్నత పాఠశాల లో వెయ్యి లీటర్ల సామర్థ్యం గల అర్ ఓ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే బెందాలం అశోక్ ప్లాంట్ ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి కౌన్సిలర్ ఆసి లీలా రాణి, పి ఈ టి లత తదితరులు పాల్గొన్నారు.

# వజ్రోత్సవ ఎగ్జిబిషన్‌లో నియోజకవర్గాల వైభవం



**-పలాస స్టాల్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, ఆగస్టు 14(వార్త):** జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో వజ్రోత్సవ వేడుకల భాగంగా ఏర్పాటు చేసిన ఎనిమిది నియోజకవర్గాల ప్రత్యేకతల స్టాళ్లు గురువారం రెండో రోజూ సందర్శకులను ఆకట్టుకున్నాయి. పలాస నియోజక వర్గ స్టాల్స్ ను ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. స్వాతంత్ర్య కాలం నాటి గుర్తులు, స్థానిక తినుబండారాలు, స్వాతంత్ర్య సమరయోధులు, కళాకారులు, సాహిత్యకారులు, చారిత్రక భవనాలు, కళాఖండాలు, చేనేత ఉత్పత్తులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. గురువారం సాయంత్రం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్టాళ్లను సందర్శించారు. ఎమ్మెల్యే తో పాటు ఎ పి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టీ డి పి నాయకులు యవ్వారి మోహనరావు, తమ్మినేని గంగారాం, సాసుమాన చంద్రమౌళి పాల్గొన్నారు.

## స్వర్ణభారతిలో కృష్ణాష్టమి వేడుకలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 14(వార్త):** స్థానిక స్వర్ణ భారతి విద్యా సంస్థలు ఆధ్వర్యంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు వేషధారణలో అలరించారు. చైర్మన్ చాట్ల తులసీదాసు రెడ్డి వేడుకలు ను ప్రారంభించారు.ఉట్ల సంబరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీలిమా రెడ్డి,ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు,లీలా లక్ష్మీ,విజయలక్ష్మి, గుణ వతి తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546